సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

చింతలపూడి సబ్‌జైలు సందర్శన

ప్రజాశక్తి - చింతలపూడి

సబ్ జైలులో సిబ్బంది అందరూ బాధ్యతగా పని చేయాలని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ చెప్పారు. చింతలపూడి సబ్‌జైలును ఆయన సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, తాగునీటి సౌకర్యాలు, అనారోగ్యంగా ఉన్నవారికి అందించే వైద్య సదుపాయాలు, తదితర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. నిందితులకు అందించిన ఉచిత న్యాయ సలహాలపై ఆరా తీశారు..వంటశాలను, స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపకారగార పర్యవేక్షణ అధికారి కృపానందం, కోర్టు సూపరిటెండెంట్ పిజి.నాయుడు పాల్గొన్నారు.

'సహకార' ఎన్నికలు లేనట్టే..!

- పది జిల్లాలకు డిసిసిబి, డిసిఎంఎస్ ఛైర్మన్ల నియామకం
- 'పశ్చిమ' డిసిసిబి ఛైర్మన్ పదవిపై వీడని ఉత్కంఠ
- సహకార సంఘాలకు కమిటీలను నియమించనున్నట్లు ప్రచారం
- రెండు జిల్లాల్లో 281 సహకార సంఘాలకు మళ్లీ కమిటీలే దిక్కా?
- 2018 నుంచి సహకార వ్యవస్థకు ఎన్నికలు లేకుండా చేసిన పాలకులు
- గత ప్రభుత్వం దారిలో కూటమి సర్కార్



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సహకార వ్యవస్థకు ఇప్పట్లో ఎన్నికలు లేనట్టేనని తేలిపోయింది. వచ్చే జులై నెలలో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని ఇప్పటి వరకూ అందరూ భావించారు. ప్రభుత్వం సోమవారం పలు జిల్లాలకు డిసిసిబి, డిసిఎంఎస్ ఛైర్మన్లను నియమిస్తూ ప్రకటన చేయడంతో ఇప్పట్లో సహకార వ్యవస్థకు ఎన్నికల్లో నిర్వహించే ఆలోచన ప్రభుత్వానికి లేదని అర్థమవుతోంది. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు పాలించాల్సిన సహకార వ్యవస్థను ప్రభుత్వం తమ రాజకీయ అవసరాల కోసం నామినెటెడ్ పోస్టుల భర్తీలకు అలవంగా మార్చేసిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ నిర్ణయంతో మరోసారి సహకార వ్యవస్థ ప్రభుత్వం నియమించే కమిటీలతోనే సాగనున్నట్లు తెలుస్తోంది. ఏలూరు జిల్లాలో 159, పశ్చిమలో 122 మొత్తం 281 సహకార సంఘాలు ఉన్నాయి. ఇవన్నీ ఏలూరు డిసిసిబి పరిధిలోనే నడుస్తున్నాయి. 2013 జనవరిలో కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం సహకార సంఘాలకు, డిసిసిబి, డిసిఎంఎస్‌లకు ఎన్నికలు నిర్వహించింది. 2018 జనవరిలో పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. మరో ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో అప్పట్లో టిడిపి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ఆ పాలకవర్గాల పదవీకాలం పొడిగించింది. 2019 ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సహకార సంఘాల ఎన్నికలను నిర్వహిస్తుందని అంతా భావించారు. అందుకు విరుద్ధంగా త్రిసభ్యకమిటీని నియమించింది. డిసిసిబికి ఛైర్మన్, ఇద్దరు డైరెక్టర్ల కమిటీని ఏర్పాటు చేసింది. దీంతో దాదాపు ఎనిమిదేళ్లుగా సహకార సంఘాలకు ఎన్నికలు లేకుండాపోయాయి. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. త్రిసభ్య కమిటీలను రద్దుచేసి ప్రత్యేక అధికారులను నియమించింది. అదే ఏడాది డిసెంబర్‌లో సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం సంకేతాలిచ్చింది. అందుకు విరుద్ధంగా మళ్లీ ప్రత్యేక అధికారుల కాలపరిమితిని ఆరునెలలు పొడిగించింది. సహకార సంఘాల్లో కంప్యూటీకరణ పూర్తయిన తర్వాత వచ్చే జులైలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందన్న ప్రచారం సాగింది. అనూహ్యంగా పది జిల్లాలకు డిసిసిబి, డిసిఎంఎస్ ఛైర్మన్లను ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. దీంతో సహకార సంఘాల ఎన్నికలపై నీలినీడలు కమ్ముకున్నాయి. గత వైసిపి విధానంలోనూ కూటమి సర్కార్ నడుస్తుందని స్పష్టమవుతోంది. సహకార సంఘాలకు ఎన్నికల జరగకపోవడంతో రైతులు ఎన్నో రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. రైతుల ఇబ్బందులను ఏ మాత్రమూ పట్టించుకోకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. కమిటీల ఏర్పాటు చేయడంతో సహకార సంఘాల్లో అవినీతి పెచ్చుమీరుతుందన్న విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి.

'పశ్చిమ' డిసిసిబి ఛైర్మన్‌పై వీడని ఉత్కంఠ

రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాలు ఉండగా పది జిల్లాలకు డిసిసిబి, డిసిఎంఎస్ ఛైర్మన్లను ప్రకటించింది. పశ్చిమ డిసిసిబి, డిసిఎంఎస్ ఛైర్మన్లను ప్రకటించలేదు. ఇది జిల్లా నాయకుల్లో చర్చనీయాంశంగా మారింది. డిసిసిబి ఛైర్మన్ పదవికి ఉంగుటూరు నియోజకవర్గ నాయకుడు వట్టి పవన్ తీవ్ర ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. జనసేన జిల్లా నాయకులు కొటికలపూడి గోవిందరావు డిసిసిబి ఛైర్మన్ రేసులో ఉన్నట్లు చెబుతున్నారు. టిడిపి నుంచి డిసిసిబి ఛైర్మన్ పదవి ఆశిస్తున్న వారు పెద్దగా కనిపించడం లేదు. రాష్ట్రస్థాయి పదవి ఆప్కాబ్ ఛైర్మన్ పదవిని మాత్రం మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు ఆశిస్తున్నారు. డిసిసిబి ఛైర్మన్ పదవులను ప్రకటించడంతో సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీని నియమించనున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పదవుల కోసం నాయకుల వద్దకు క్యూకడుతున్న పరిస్థితి నెలకొంది. ఏం జరుగుతుందో వేచిచూడాల్సి ఉంది.

వడదెబ్బపై అప్రమత్తత అవసరం

జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. సోమవారం కలెక్టరేట్ గోదావరి సమావేశం హాల్లో వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డిఎంహెచ్ఒ ఆర్.మాలిని, డిసిహెచ్ఎస్ పాల్ సతీష్ కుమార్‌తో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరూ వడదెబ్బకు గురికాకుండా ఉండాలంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోజూ తగినన్ని నీళ్లు తాగడం, నేరుగా ఎండ వేడిమి తాకకుండా జాగ్రత్తలు పాటించడం ముఖ్యమని చెప్పారు. ముఖ్యమైన పనులకు మినహా మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకూ బయటకు వెళ్లకూడదని, ఈ సమయంలో శారీరక శ్రమ అవసరమైన పనులు నిర్వహించకూడదని సూచించారు. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు ఎండాకాలంలో మరింత శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రజలు, అధికారులు, సిబ్బంది బయటకు వెళ్లే సమయంలో తల కప్పుకునే విధంగా టోపీలు, గుడ్డ మఫ్లర్లు వాడాలని సూచించారు. లేత రంగుల నూలు దుస్తులు ధరించాలన్నారు. ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆల్కహాల్, మత్తు పదార్థాలు తీసుకోవడం మానుకోవడం అవసరమని పేర్కొన్నారు. అధిక మసాలా ఉన్న ఆహారం తినకుండా, పోషకతత్వంతో కూడిన తేలికపాటి ఆహారం తీసుకోవాలన్నారు. శుభ్రమైన తాగునీటినే ఉపయోగించాలని, కూల్‌డ్రింక్స్, అధిక చక్కెర ఉన్న పానీయాలు, కాఫీ, టీ వంటి పానీయాలు తగ్గించాలని సూచించారు. చెమట పట్టకపోవడం, వణుకు పుట్టడం, మగత, నిద్ర లేదా కలవరింతలు, శరీర ఉష్ణోగ్రత పెరగడం, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితిలోకి వెళ్లడం వడదెబ్బ లక్షణాలని పేర్కొన్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే, సంబంధిత వ్యక్తిని వెంటనే 108 అంబులెన్స్ సాయంతో దగ్గరలోని ప్రభుత్వాసుపత్రికి తరలించాలని తెలిపారు.

విఎస్ఎస్‌లో పేదలకు..

షేర్ డబ్బులు విడుదల చేయాలని వినతి

ఏలూరు రేంజ్ ఆఫీసర్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విఎస్ఎస్ సభ్యులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వన సంరక్షణ సమితుల్లో పని చేస్తున్న పేదలకు, అటవీ శాఖ నుంచి ఇవ్వాల్సిన షేర్ డబ్బులను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ బృందం ఆధ్వర్యంలో అటవీ ప్రాంత పేదలు, విఎస్ఎస్ సభ్యులు ఏలూరు రేంజ్ ఆఫీసర్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఏలూరు జిల్లా మెట్ట ప్రాంతంలో అటవీ భూముల్లో జామాయిల్, బ్యాంబో తదితర మొక్కలు వేసి సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ మొక్కల ఫల సాయం అటవీ శాఖకు, పేదలకు ప్రభుత్వం విడుదల చేస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఏలూరు జిల్లాలో వన సంరక్షణ సమితుల్లో పని చేస్తున్న కూలీలకు వేతనాలు నేటికీ ఇవ్వలేదని తెలిపారు. ప్రభుత్వం అటవీ శాఖ నుంచి రావాల్సిన షేర్ డబ్బులు పేదలకు అందలేదన్నారు. ఇప్పటికే సంవత్సరాల తరబడి ఈ భూముల్లో పనిచేస్తూ రావాల్సిన షేర్ అమౌంట్ రాకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లాలో ఉంగుటూరు, లింగపాలెం, చింతలపూడి, కామవరపుకోట, పెదవేగి మండలాల్లో వన సంరక్షణ సమితిలో వేల మంది పేదలు అటవీ ప్రాంత భూముల్లో పనిచేస్తున్నారని తెలిపారు. వారికి ఇవ్వాల్సిన లక్షల రూపాయల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వన సంరక్షణ సమితిల షేర్ డబ్బులు, పని చేసిన కూలీల వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏలూరు శాఖ రేంజర్ కుమార్ మాట్లాడుతూ పేదలకు ఇవ్వాల్సిన షేర్ అమౌంట్‌ను వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, పేదలకు రావాల్సిన వేతనాల ప్రకారం వెంటనే విడుదల చేసేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విఎస్ఎస్‌ల నాయకులు నాగేశ్వరరావు, మోహన్ రావు, లక్ష్మి, జయరాజు పాల్గొన్నారు.

1.55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

అధికారులతో సమీక్షిస్తున్న జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి 12,380 మంది రైతుల నుంచి 1,55,529 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి చెప్పారు. సోమవారం స్థానిక గోదావరి సమావేశ మందిరంలో రబీ ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. రైతుల నుంచి ఇంతవరకూ 359.27 కోట్ల రూపాయల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా అందులో ఇంతవరకూ 206.71 కోట్ల రూపాయలను రైతుల ఆధార్ అనుసంధాన ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. మిగిలిన 150.30 కోట్ల రూపాయలు జమ చేసే ప్రక్రియలో ఉందన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 126 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ఏజెన్సీల ద్వారా ఎఫ్ఎక్యూ నిబంధనల ప్రకారం విక్రయించుకుని ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర పొందొచ్చన్నారు. రైతుల శ్రేయస్సు కోసం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఇచ్చిన నివేదిక ప్రకారం ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు ఏజెన్సీల వద్ద గోనె సంచులు, టార్పాలిన్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఎటువంటి సందేహాలు ఉన్నా, ఫిర్యాదులు చేసేందుకు జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 08812-230448, 7702003584, 7569562076 నంబర్లకు తెలియజేయవచ్చన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల మేనేజర్ పిఎస్ఆర్.మూర్తి, డిఎస్ఒ ప్రతాప్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరసన

నిరసన తెలుపుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తమకు రావాల్సిన ఎనిమిది నెలల పెండింగ్ ఇన్సెంటివ్‌లతోపాటు ఇతర సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సోమవారం నిరవధిక సమ్మె చేపట్టి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు సొంగా సిద్ధయ్య మాట్లాడుతూ 2018లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా విధుల్లో చేరిన తాము జిల్లా వ్యాప్తంగా 481 మంది, రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల 32 మంది పనిచేస్తున్నామని, తమకు 25 వేల రూపాయల జీతంతోపాటు 15 వేల రూపాయలు పని ఆధారంగా ఇన్సెంటివ్‌లు ఇస్తున్నారని, అయితే ఎనిమిది నెలలుగా ఇన్సెంటివ్ నిలుపుదల చేశారని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. నిలుపుదల చేసిన పిఎఫ్‌ను పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలని, ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం గత నెల 15వ తేదీ నుంచి వివిధ రకాలుగా నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో గత్యంతరం లేక నిరవధిక సమ్మె చేపట్టడం జరిగిందని, తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకూ సమ్మె కొనసాగుతుందని తెలిపారు. జిల్లా కార్యదర్శి సురేంద్ర, చాందిని, విమల కుమారి, సులోచన, సజ్జన్ కుమార్, రవితేజ, వినయ్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగునికి మూడు చక్రాల బ్యాటరీ వాహనం అందజేత

ఏలూరు : జిల్లా కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో శారీరక విభిన్న ప్రతిభావంతులైన జంగారెడ్డిగూడేనికి చెందిన వీరవల్లి శంకరరావు రూ.65 వేల విలువైన మూడు చక్రాల బ్యాటరీ వాహనాన్ని కలెక్టర్ ఉచితంగా పంపిణీ చేశారు. మూడు చక్రాల బ్యాటరీ వాహనాన్ని మంజూరు చేయాలని కోరతూ పిజిఆర్ఎస్ కార్యక్రమంలో గతంలో అర్జీ అందించారు. దీంతో కలెక్టర్ స్పందించి మూడు చక్రాలు వాహనాన్ని మంజూరు చేసి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడు చక్రాల బ్యాటరీ వాహనం ద్వారా చిరు వ్యాపారాలు చేసుకుని కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. మూడు చక్రాల బ్యాటరీ వాహనం ఉచిత అందించినందుకు వీరవల్లి శంకరరావు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం

ఏలూరులో..

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక ఏలూరు బాలల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బాలల గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కారంశెట్టి రమేష్‌బాబు మాట్లాడుతూ ఈ విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులకు డ్రాయింగ్, కథలు చెప్పించడం, కథలు చదివించడం, వేమన సుమతి శతక పద్యాలు వాటి భావాలు వివరించడం, డ్యాన్స్, జనరల్ నాలెడ్జ్, యోగా తదితర తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజ్ఞాన శిబిరాలు రిసోర్స్ పర్సన్స్‌చే జూన్ ఆరో తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఈ తరగతులను వినియోగించుకోవాలన్నారు. వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించనున్నట్లు గ్రంథాలయ నిర్వహకురాలు ఎం.శోభ తెలిపారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కమిటీ సభ్యులు గోవు నరసింహారావు, మధ్యాహ్నపు పద్మనాభరావు, వర్రె కొండలరావు, లంక చాముండేశ్వరరావు, ఎన్‌వి.గంగాభవాని, మ్యూజిక్ టీచర్ ఎఆర్‌డిజికె సూల్ గంగాధరరావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులను ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తకాలే మొదటి నేస్తమన్నారు. తరచూ గ్రంథాలయానికి రావడం ఒక అలవాటుగా చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా శిక్షణా తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు ఆయన స్నాక్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ విటి.సందీప్‌కుమార్, డి.శ్రీవల్లి, సీనియర్ రిసోర్స్‌పర్సన్ పి.శంకర్, డ్రాయింగ్ టీచర్, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : వేసవి విజ్ఞాన తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్ తెలిపారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులకు నీతి పద్యాలు బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో విద్యార్థులకు కథలు, కథనాలు, సృజనాత్మకత కృత్యాలతో పాటు వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వేసవిలో చిన్నారులు శిక్షణ తరగతులు వినియేగించుకోవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు.

ముదినేపల్లి :ముదినేపల్లి, గురజ శాఖ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, కథలు చదివించడం, ఆటలు, పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి ఎం.శ్రీదేవి మాట్లాడుతూ జూన్ ఆరో తేదీ వరకు నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి విజ్ఞాన శిబిరాలకు తప్పకుండా పంపించాలన్నారు.

ఆగిరిపల్లి :గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగపర్చుకోవాలని ఆగిరిపల్లి శాఖా గ్రంథాలయాధికారి నాగేశ్వరరావు అన్నారు. ఆగిరిపల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్, కథలు వివరించారు. ఈ కార్యక్రమంలో కలపాల రాజ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

కలిదిండి :స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని తహశీల్దార్ ఎల్‌విఎస్.రామకృష్ణ ప్రారంభించారు. వేసవి సెలవుల్లో సెల్‌ఫోన్ వినియోగానికి దూరంగా ఉంటూ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. జూన్ ఆరో తేదీ వరకు ప్రతిరోజూ ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకు పుస్తక పఠనంతో పాటు స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు, ఆటలు, వివిధ పోటీలు జరుగుతాయని శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్ తెలిపారు. ఉపాధ్యాయులు జి.లక్ష్మణస్వామి, సన్నీబాబు, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సకాలంలో సమస్యల పరిష్కారం

నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీల్లోని సమస్యలను సకాలంలో పరిష్కరించనున్నట్లు నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ తెలిపారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికగా కొనసాగుతున్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించగా 13 అర్జీలను సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్య పరిష్కారానికి నిర్ణీత వ్యవధి ఉందన్నారు. అన్ని అర్జీలను ఆన్‌లైన్ చేయనున్నట్లు తెలిపారు. సమయం ముగిసే లోపు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. జటిలమైన సమస్యలు పరిష్కారం కాకుంటే వాటి వివరాలను అర్జీదారులకు తెలియజేయనున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాలు, పట్టణాలు, మండల స్థాయిలో సమస్యలు పరిష్కారం కాకుంటే ఆ సమస్యలను తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.

వృద్ధురాలి వద్దకు వచ్చి అర్జీ స్వీకరించిన సబ్ కలెక్టర్

నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ స్వయంగా వృద్ధురాలి వద్దకు వచ్చి అర్జీ స్వీకరించారు. సీతారామపురం గ్రామానికి చెందిన బండారు సంపూర్ణమ్మ అనారోగ్య కారణాలతో ఆటోలో వచ్చి సమస్యను వివరించే ప్రయత్నం చేశారు. ఆటో దిగి రాలేని విషయాన్ని గ్రహించిన సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ ఆటో వద్దకు వెళ్లి అర్జీని స్వీకరించారు. సంపూర్ణమ్మ కుమార్తెలను సమస్యను అడిగి తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు.

ప్రజల భద్రతే లక్ష్యంగా తనిఖీలు

విజయవాడ రైల్వే డిఎస్‌పి రత్నరాజు

తనిఖీలు చేస్తున్న రైల్వే పోలీసులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజల భద్రతే లక్ష్యంగా రైల్వే స్టేషన్ల పరధిలో తనిఖీలు చేపడుతున్నామని విజయవాడ రైల్వే డిఎస్‌పి రత్నరాజు తెలిపారు. నగరంలోని పెద్ద రైల్వేస్టేషన్‌లో రాష్ట్రస్థాయి అధికారులు ఉత్తర్వుల మేరకు విజయవాడ రైల్వే ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ ఉత్తర్వుల మేరకు రెండో రోజు తనిఖీలు కొనసాగించారు. ఈ తనిఖీల్లో రైల్వే డిఎస్‌పి రత్నరాజుతో పాటు జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ పోలీసులు సంయుక్తంగా పాల్గొన్నారు. వాహన స్టాండ్లు, పార్శిల్ కౌంటర్లు, ప్రయాణికుల లగేజీలు, టికెట్ కౌంటర్లను పూర్తిగా తనిఖీ చేశారు. అలాగే బాంబ్ స్క్వాడ్ తనిఖీలు కూడా నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా రాకీ అనే రైల్వే జాగిలంతో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో రాకీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రయాణికులను, వారు వెళ్లాల్సిన గమ్యస్థానాలను అడిగి తెలుసుకున్నారు. ప్లాట్ ఫామ్‌లో వద్ద అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని ప్రయాణికులకు సూచించారు. ఈ సందర్భంగా బిఎస్‌పి రత్నరాజు మాట్లాడుతూ రైల్వే శాఖ అప్రమత్తంగా ఉండేందుకు ప్రజల భద్రతను కాపాడేందుకు వరుసగా రెండు రోజులపాటు ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ఈ తనిఖీల్లో జిఆర్‌పి పోలీసులు ఆర్‌పిఎఫ్ పోలీసులు సంయుక్తంగా పాల్గొన్నారని ఆయన తెలిపారు.

ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలి

2న మన్యం బంద్‌ను జయప్రదం చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ మే రెండో జరిగే మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్‌సి ద్వారా గిరిజనులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. పడమర రేగులకుంట గ్రామంలో సోమవారం నిర్వహించిన గిరిజన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఉన్న ఖాళీలను గిరిజనులతో భర్తీ చేసే విధంగా ప్రత్యేకమైన జిఒ తీసుకొచ్చి గిరిజనులకు న్యాయం చేస్తామని ఎన్నికలు ముందు అరకు సభలో చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. మెగా డిఎస్‌సిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు 1034 పోస్టులు కేటాయించగా ఐటిడిఎకు 32 పోస్టులే కేటాయించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి గిరిజనులకు ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. వచ్చే నెల రెండో తేదీన జరిగే మన్యం బంద్‌కు ప్రజలంతా సహకరించాలని, గిరిజన యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పోలోజు నాగేశ్వరరావు, వెట్టి వీరయ్య, నూక భద్రం, తెల్లం ప్రసాద్, కుంజ లక్ష్మణరావు, దుర్గారావు, సత్తిబాబు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి డొక్కా సీతమ్మ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఆకలితో వచ్చిన వారికి లేదనకుండా వేదానంతరం నిత్యాన్నదానం చేసి అపర అన్నపూర్ణగా, తెలుగు ప్రజల హృదయాల్లో నిలిచిపోయిన డొక్కా సీతమ్మ తల్లి 116వ వర్ధంతిని పురస్కరించుకుని శిరస్సు వంచి నమస్కరిస్తూ వినమ్ర పూర్వకంగా నివాళులర్పిస్తున్నామని ఆర్‌టిసి జోనల్ చైర్మన్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో డొక్కా సీతమ్మ 116వ వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు జగపతి మనోహరం స్వామి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ ఎంతమంది ఆకలితో వచ్చిన వారందరి ఆకలి తీర్చిన మహోన్నతమైన వ్యక్తి అని అన్నారు. జగపతి స్వామి మాట్లాడుతూ తాము ప్రతి ఏడాది ఈ మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.


విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రముఖులు

ఘనంగా షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ మహోత్సవం

బహుమతులు అందజేత

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని కెకెఆర్ హ్యాపీ వ్యాలీ స్కూల్లో సోమవారం షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు వందకు పైగా లఘు చిత్రాలు నమోదు కాగా థాంక్ గాడ్ అనే చిత్రానికి ప్రథమ స్థానం, నేస్తం అనే చిత్రానికి ద్వితీయ స్థానం, ఉపవాసం అనే చిత్రానికి తృతీయస్థానం వచ్చింది. ఈ లఘు చిత్రాలకు నగదు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల అధినేత డాక్టర్ కొసరాజు కోటేశ్వరరావు షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్లో పాల్గొన్న ప్రతిభావంతులకి అభినందించి వారికి గుర్తింపు పత్రంతో పాటు షీల్డ్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో 64 కళల డాట్‌కామ్ అధినేత కళాసాగర్ స్ఫూర్తి శ్రీనివాస్, వరప్రసాద్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలని వినతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక దాంగేనగర్ సమీపంలోని ముత్యాలమ్మ నగర్ ఆంజనేయస్వామి ఆలయం పక్కన ఉన్న సీసీ రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలని పట్టణ పౌర సమాఖ్య పట్టణ కార్యదర్శి పంచ గోపీ కోరారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గోపీ మాట్లాడుతూ పట్టణంలోని దాంగేనగర్ సమీపంలోని ముత్యాలమ్మ నగర్ ఆంజనేయస్వామి ఆలయం పక్కన ఉన్న సీసీ రోడ్డు నిర్మాణం వెంటనే నిర్మించాలని కోరారు. ఈ దారిలో రాళ్లు, గోతుల వల్ల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇక్కడ నివాసం ఉంటున్న పెద్ద వయసు వారు నడవడానికి కష్టతరంగా ఉంటున్నారు. ప్రజల వద్ద నుంచి జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ వారు ఎంతో చిత్తశుద్ధితో పన్నులు వసూలు చేస్తున్న అధికారులు పట్టణ ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలైన రోడ్లు, డ్రెయిన్స్, వీధిలైట్ల విషయంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ముత్యాలమ్మ నగర్‌లో ఆంజనేయ ఆలయం వద్ద ఉన్న సీసీ రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలని, లేకపోతే ప్రజా సంఘాలు, స్థానిక ప్రజలను ఐక్యపరిచి సీసీ రోడ్డు నిర్మాణానికి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్‌కె.మాబూసుభాని, మున్సిపల్ యూనియన్ నాయకులు బాలరాజు, రైతు సంఘం నాయకులు బొద్దు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కేటుగాడు అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

యువతిని మోసగించి రూ.1.60 లక్షలు కాజేయడమే కాకుండా లింక్ ద్వారా వాట్సాప్ హ్యాక్ చేసి యువతి ఫొటోలు మార్ఫింగ్ చేసి అంతర్జాలంలో పెడతానని బెదిరించిన కేటుగాడిని పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని ఏలూరు డిఎస్‌పి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. భీమడోలు మండలం ఆగడాలంక గ్రామానికి చెందిన ఓ యువతి ఆమె సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ డేటింగ్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకుంది. ఈ క్రమంలో కడప జిల్లా వేముల మండలం వేముల గ్రామానికి చెందిన రాజశేఖర్ అనే యువకుడు ఆ యాప్‌లో పరిచయమయ్యాడు. ఐటిఐ వరకు చదువుకున్న యువతికి తాను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అని ఆమెకు మాయమాటలు చెప్పాడు. తనకు కొంత సొమ్ము అప్పు కావాలని, లోన్ కోసం ప్రయత్నిస్తున్నానని యువతి అతనికి తెలిపింది. దీంతో యువకుడు తనకు తెలిసిన బ్యాంకు మేనేజర్లు ఉన్నారంటూ నమ్మబలికాడు. అనంతరం ఒక ఫేక్ ట్రాన్సాక్షన్ రిసీప్ట్‌ను అతనే స్వయంగా తయారుచేసి ఆమెకు వాట్సాప్ ద్వారా పంపి లోన్ శాంక్షన్ అయిందని, నీ ఖాతాలో సొమ్ము జమ అయిందని యువతితో చెప్పాడు. కాని ఆమె ఖాతాలో నగదు జమ కాకపోవడంతో తిరిగి రాజు యాదవ్‌ను ఆమె ప్రశ్నించింది. అందుకు అతను బ్యాంకులో టెక్నికల్ సమస్యల వల్ల కాలేదని, ప్రాసెసింగ్ ఫీజు కట్టాలని ఆమెను నమ్మించి పలు దఫాలుగా రూ.1.60 లక్షలు ఆమె వద్ద నుంచి ఫోన్ పే ద్వారా తీసుకున్నాడు. ఆమె మళ్లీ మళ్లీ సొమ్ము గురించి అడుగుతూ ఉండడంతో ఆమె వాట్సాప్‌కు ఓ లింకును పంపి ఈ లింక్‌ను ఓపెన్ చేస్తే సొమ్ము జమ అవుతుందని ఆమెకు తెలిపాడు. ఆ లింకును ఆమె ఓపెన్ చేసిన వెంటనే ఆమె వాట్సాప్ హ్యాక్ అయింది. దీంతో ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి అంతర్జాలంలో పెడతానని బెదిరింపులకు గురి చేయసాగాడు. దీంతో విసుగు చెందిన ఆమె భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన భీమడోలు పోలీసులు అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అధునాతన పరిజ్ఞానం సహాయంతో అతను పోతునూరు సమీపంలో ఉన్నట్లు గుర్తించి సోమవారం అరెస్టు చేశారు.

ఎటిఎంలో నగదు కాజేసేందుకు యత్నం

వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నగరంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఎటిఎంను పగలకొట్టి నగదు కాజేసేందుకు ప్రయత్నించిన ఘటనలో నిందితుడిని ఏలూరు ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఏలూరు ఒకటో పట్టణ ఎస్ఐ నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు తూర్పు వీధికి చెందిన తిరుమల వెంకట్ ఆదివారం తెల్లవారుజామున విజయలక్ష్మి థియేటర్ సమీపంలో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా ఎటిఎంను పగలకొట్టి అందులో నగదు కాజేసేందుకు ప్రయత్నించి ఫలితం లేకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై బ్యాంకు సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి 24 గంటల్లో నిందితుడు వెంకట్‌ను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. న్యాయమూర్తి అతనికి 14 రోజుల రిమాండ్ విధించారు.

బైండోవర్ ఉల్లంఘన

ఇద్దరికి జరిమానా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఎక్సైజ్ నేరాలకు పాల్పడి బైండోవర్‌ను అతిక్రమించడంతో తహశీల్దార్ సోమవారం జరిమానా విధించినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య తెలిపారు. నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నూజివీడు మండలానికి చెందిన ఇరువురు నిందితులు నూజివీడు తహశీల్దార్ బివి.సుబ్బారావు ఎదుట హాజరై ఎక్సైజ్ నేరాలు చేయబోమని బైండోవర్ అయిన తరువాత కూడా ఎక్సైజ్ నేరం చేసి బైండోవర్ ఉల్లంఘించారు. ఇందుకు పోతురెడ్డిపల్లి గ్రామానికి చెందిన రెడ్డి కౌసల్యకు రూ.పది వేలు, జంగంగూడెం గ్రామానికి చెందిన చల్లారి రవీంద్రబాబుకు రూ.పది వేలు జరిమానాను నూజివీడు తహశీల్దార్ డివి.సుబ్బారావు విధించినట్లు ఎ.మస్తానయ్య తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రిజిస్ట్రేషన్‌లో స్లాట్ బుకింగ్ విధానం

సబ్ రిజిస్ట్రార్ రాఘవరావు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో కొత్త విధానాన్ని అమలు చేస్తుందని సబ్ రిజిస్ట్రార్ రాఘవరావు తెలిపారు. నూజివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆయన సోమవారం మాట్లాడుతూ కక్షిదారులు నేరుగా కార్యాలయానికి వచ్చి సమయాన్ని వృధా చేసుకోకుండా ప్రభుత్వం ఓ చక్కని వెసులుబాటు కల్పించిందన్నారు. ఏ ప్రాంతం నుంచైనా నెట్ సెంటర్, ల్యాప్‌టాప్, ఇతర ఆన్‌లైన్ వెసులుబాటు విధానాల్లో ఆస్తుల క్రయవిక్రయాలకు సంబంధించి స్లాట్ బుక్ చేసుకునే విధానం అమలవుతుందన్నారు. వారి వారి ఆస్తులకు సంబంధించి దస్తావేజులను పూర్తిస్థాయిలో సిద్ధం చేసుకున్న తర్వాత రిజిస్ట్రేషన్ కోసం చలానా కట్టిన తర్వాత ఈ స్లాట్ విధానాన్ని బుక్ చేసుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల కక్షిదారుల విలువైన సమయం వృధా కాకుండా ఉంటుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు స్లాట్ బుక్ చేసుకునే అవకాశం ఉన్నట్లు చెప్పారు. ఈ నూతన విధానంలో కక్షిదారులు అసౌకర్యానికి గురి కావాల్సిన అవసరం లేదన్నారు. స్లాట్ నిర్ణయించిన సమయంలో కక్షిదారులు, ఇరుపక్షాలు, నిబంధనల మేరకు సాక్షులు కూడా అందుబాటులో ఉంటే తక్షణమే రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని పొందే అవకాశం ఉందన్నారు. స్లాట్ బుక్ చేసిన సమయానికి ఏవైనా అవాంతరాలు ఎదురైతే అదే రోజు సాయంత్రం 5:30 గంటల తరువాత సౌకర్యాన్ని వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. కక్షిదారులు అవగాహన కలిగి ఉండి ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

20న దేశవ్యాప్త సమ్మె జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కుక్కునూరు

మేడే ప్రదర్శన సభల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి పిలుపునిచ్చారు. దాచారంలో బాడీస సుజాత అధ్యక్షతన సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డివిజన్ స్థాయి శిక్షణ తరగతులు సోమవారం రెండో రోజుకు చేరుకున్నాయి. మేడే రోజు కుక్కునూరు మండల కేంద్రంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభలో, ప్రదర్శనలో కార్మికులంతా ఐక్యంగా పాల్గొనాలన్నారు. మే 20 తేదీన దేశవ్యాప్తంగా కార్మిక వ్యతిరేక చట్టాలకు నిరసనగా జరిగే పోరాటంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ కూలీలు, ఉపాధిహామీ కూలీలు పాల్గొనాలన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్, జిల్లా కార్యదర్శి మొడియం నాగమణి, సిపిఎం మండల కార్యదర్శి భయ్యాన శ్రీను, సిఐటియు నాయకులు తిరోజుల సురేష్, మెడవరపు రమాదేవి, వర్స మంగ, కణితి మంగ, అన్నపూర్ణ, అలివేలు, కృష్ణవేణి, షేక్ వలీపాషా, గొంది దుర్గమ్మ, సున్నం పార్వతి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత హెచ్‌ఎం లక్ష్మీనరసింహారావు మృతి

ప్రజాశక్తి - ముసునూరు

ఉపాధ్యాయుడిగా, రాజకీయ నాయకులుగా గ్రామంతో పాటు మండలంలోని ఎన్నో సేవలందించి పేరు ప్రఖ్యాతలు గాంచిన మండలంలోని కాట్రేనిపాడు గ్రామానికి చెందిన సూర్యదేవర లక్ష్మీనరసింహారావు (84) అనారోగ్యంతో మృతి చెందారు. ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులుగా 13 ఏళ్ల పాటు పనిచేసి రైతులకు ఆదర్శ రైతుగా నిలిచారు. నరసింహారావుకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతదేహాన్ని టిడిపి నాయకులు బొమ్మకంటి శ్యామలరావు, బాలకృష్ణ, రాపర్ల ప్రతాప్, గద్దల సుహాసిని మోహనరావు, గూడపాటి అజయ్, బడిపాటి సాంబయ్య, పిన్నిబోయిన మంగయ్య తదితరులు సందర్శించి నివాళులర్పించారు.


లక్ష్మీనరసింహారావు (ఫైల్‌ఫొటో)

'కులం పేరుతో దూషించినవారిపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి- ముదినేపల్లి

ఓ మహిళను మాల కులం పేరు పెట్టి దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సేవ నాగ జగన్ బాబూరావు కోరారు. ముదినేపల్లిలోని రాష్ట్ర మాల మహానాడు కార్యాలయంలో బాబూరావు మాట్లాడుతూ మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన కారుమూరి మురళీ ఒక గొడవలో బహిరంగంగా గ్రామస్తుల సమక్షంలో మాల కులం పేరు మనోభావాలు దెబ్బతినే విధంగా దూషించారని బాబూరావు తీవ్రంగా ఖండించారు. ఈ విషయమై వారి మీద ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు పెడుతున్నామన్నారు, వారి మీద కేసు నమోదు చేసి విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. న్యాయం జరగని పక్షంలో కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

తాగునీరివ్వండి సారూ..!

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

ద్వారకాతిరుమల గ్రామంలోని చాలా ప్రాంతాల్లో కొంత కాలంగా నీటి సమస్య ఉంది. తాగడానికి, వాడుకోవడానికి కూడా నీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు వాపోతున్నారు. బురదనీటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తాగునీరు అందక అల్లాడిపోతున్నామని ద్వారకాతిరుమల తూర్పు వీధి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు తాగునీరు అందించాలని వారు వేడుకుంటున్నారు. నీటి సమస్యపై పలుమార్లు అధికారులకు చెప్పుకున్నా కనీసం తాగడానికి గుక్కెడు నీళ్లు కూడా ఇవ్వడం లేదన్నారు. అరకొరగా నీళ్లు ఇచ్చినా బురద నీరు రావడంతో కనీసం వాడుకోవడానికి కూడా పనిచేయడం లేదని వాపోతున్నారు. బురదనీటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తాగునీరు ఇప్పించాలని యానాదుల కాలనీవాసులు కోరుతున్నారు. వీధి పంపులు ఏర్పాటు చేసి నీటి సరఫరా చేయాలని వేడుకుంటున్నారు.

కుళాయి నుంచి వస్తున్న బురదనీరు

నీటి చౌర్యం జరగకుండా చర్యలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల, గ్రామస్థాయి అధికారులు సోమవారం కాల్వగట్ల వెంబడి ఉరుకు పరుగులు పెట్టి నీటి చౌర్యం జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి పరిశీలించారు. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, సచివాలయ సిబ్బంది పోలరాజ్ కెనాల్ నుంచి డిస్ట్రిబ్యూషన్ పాయింట్లు(డిపి) ద్వారా చేపల చెరువులకు వెళ్తున్న నీటిని నిలుపుదల చేశారు. మండలంలోని గురజ, పెనుమల్లి, ముదినేపల్లి గ్రామాల్లో జరుగుతున్న నీటి చౌర్యం నిలుపుదల చేశారు. గురజలో జోరుగా నీటి చౌర్యం అనే శీర్షికతో సోమవారం ప్రజాశక్తిలో వార్త ప్రచురితమైంది. స్పందించిన జిల్లా స్థాయి అధికారుల ఆదేశాలతో సంబంధిత శాఖల అధికారులు తాగునీటిని చేపల చెరువులకు మళ్లిస్తున్న ఆక్వా రైతుల ఆగడాలకు అడ్డుకట్ట వేశారు. కాలువల వద్ద తూముల షట్టర్లు కిందకు దింపివేశారు. కాల్వలోని నీరు చేపల చెరువులకు వెళ్లకుండా నియంత్రణ చేశారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఒ శరత్‌చంద్ర మాట్లాడుతూ మండలంలో నీటి చౌర్యం జరగకుండా డిపిల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా ఆక్వా రైతులు తాగునీటి చేపల చెరువులకు మళ్లిస్తే వారిపై పై కేసు నమోదు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో తాగునీటి చెరువులు నిండినంత దున నీటిని నియోజకవర్గ శివారు గ్రామాల మంచినీటి చెరువులను నింపేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.


గురజ డిపి వద్ద ఆగిన నీటి పారుదల

డ్రెయినేజీ పొడిగించాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

డ్రెయినేజీని పొడిగించాలని కోరుతూ కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ కోరారు. ఈ మేరకు బుట్టాయగూడెం ఎంపిడిఒకు కెవిపిఎస్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాజీవ్‌నగర్ కాలనీ వాసులు, దళితులు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా పంచాయతీ కాంప్లెక్స్ షాపుల్లో గిరిజనుల పేరుతో, బినామీ పేర్లతో గిరిజన నేతలు చికెన్ షాపులు పెట్టి వ్యాపారం చేస్తున్నారన్నారు. వారు కోళ్ల వ్యర్థాలను డ్రెయినేజీలో వేయటం వల్ల దళిత పేట అయిన రాజీవ్ కాలనీ వరకు డ్రెయినేజీ నీటిలో అవి ప్రవహించి అక్కడ స్టక్ అయిపోయి మురికి కూపంగా మారి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల ప్రజలు, దళితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దళితపేట వరకే ఉన్న డ్రెయినేజీ తాళ్లచెరువు వరకు పొడిగించాలని, ఈ కోళ్ల వ్యర్థాలు దళిత పేట మీదకు వదిలిన చికెన్ షాపుల యాజమానులపై చర్యలు తీసుకుని పంచాయతీ కాంప్లెక్స్‌లో ఉన్న చికెను షాపులను తొలగించాలని కోరారు. చికెన్ వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసన వల్ల తహశీల్దార్ కార్యాలయం వద్ద కూర్చునే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యపై 26వ తేదీన పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుకు విన్నవించినట్లు తెలిపారు. ఆయన స్పందించి సమస్యను పరిష్కరించాలని ఎంపిడిఒను ఆదేశించారన్నారు. దళిత, ప్రజా సంఘాల నాయకులు శిఖామణి, ఏసుపాదం మాట్లాడుతూ కోళ్ల వ్యర్థాలను డ్రెయినేజీలో వేయకుండా ఆపాలని, లేకపోతే నిరవధిక నిరాహార దీక్ష చేయటానికి ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బుట్టాయిగూడెం మాజీ కో-ఆప్షన్ బెంబర్ దార శిఖామణి, మైనార్టీ సెల్ జిల్లా నాయకులు అమర్తుల యేసుపాదం, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తా

ఏలూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి రవీంద్ర భారతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా రవీంద్ర భారతి బాధ్యతలు తీసుకున్న సందర్భంగా సోమవారం ఎపిటిఎఫ్-1938 జిల్లా శాఖ పక్షాన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రవీంద్రభారతి మాట్లాడుతూ ఏలూరు డివిజన్ పరిధిలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తెలియజేస్తే వాటిని వెంటనే పరిష్కరిస్తానని, విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తానని, ఏలూరు డివిజన్‌ను జిల్లాలో మొదటి స్థానంలో నిలబెట్టేందుకు అందరి సహాయ సహకారాలు తీసుకుని మంచి పరిపాలన అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో 1938 రాష్ట్ర అకాడమిక్ కన్వీనర్ జి.కృష్ణ, పేరాబత్తిన సురేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మోహన్, ఉపాధ్యక్షులు ఇ.రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - వేలేరుపాడు

మండలంలోని మద్దిగట్లలో మూడు రోజుల క్రితం అగ్ని ప్రమాదంలో కంగాల సత్తిబాబుకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ మండలాధ్యక్షులు గణేశుల ఆదినారాయణ ఆధ్వర్యంలో సోమవారం కంగాల సత్తిబాబు కుటుంబానికి కూటమి నాయకుల ఆధ్వర్యంలో 25 కేజీల బియ్యం, వారం రోజుల సరిపడ కూరగాయలు, వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు అందించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షులు ఆదినారాయణ మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోవడం బాధాకరమైన విషయమన్నారు. స్థానిక ఎంఎల్ఎ చిర్రి బాలరాజు దృష్టికి తీసుకెళ్లి వీరికి న్యాయం జరిగేలా చేస్తామన్నారు. అదేవిధంగా స్థానిక రెవెన్యూ సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడి వీరికి అగ్ని ప్రమాదం జరిగినప్పుడు రావాల్సిన నిత్యావసరాలు బియ్యం అందించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన ప్రధాన కార్యదర్శి పోట్ల మోహన్‌దొర, వీర మహిళ పోడియం తులసి, లోకేష్ టీమ్ యువసేన బుడిపిటి సురేష్, యాళ్ల శంకరం, నయీమ్, బిజెపి ప్రధాన కార్యదర్శి సారే బాబ్జి, బిజెపి మాజీ మండలాధ్యక్షుడు ములకలపల్లి నరసింహారావు, జనసేన సోషల్ మీడియా ఇన్‌ఛార్జి క్రాంతి కుమార్, మంచర్ల సమ్మయ్య, సోందే పవన్ కళ్యాణ్, సోందే రవి, మడకం, ముత్యాలు, సోడేమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సాయం అందిస్తున్న దాతలు

సిపిఐ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

సత్తిబాబు కుటుంబానికి సిపిఐ మండల కమిటీ తరఫున నిత్యావసర వస్తువులుచ దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండి మునీర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కారం దారయ్య, సిపిఐ మండల కార్యదర్శి బాడిశ రాము, నాయకులు సోడే సత్తిబాబు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కలిదిండి

సిఐటియు ఆధ్వర్యంలో మేడే వర్ధిల్లాలి పోస్టర్లను కలిదిండిలో ఆవిష్కరించారు. కార్మికులందరూ ఏకమై మేడేను పురస్కరించుకుని జెండా ఆవిష్కరణలు, ప్రదర్శనలు, సభలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని నాయకులు కోరారు. సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె అబిదాబేగం, జక్కుల మహేష్, సిఐటియు నాయకులు సిహెచ్.శ్రీకాంత్, జక్కంశెట్టి మేనకలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరులో...

కొయ్యలగూడెం : మేడే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఎనిమిది గంటల పని దినాన్ని కాపాడుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాంబాబు కార్మికులకు పిలుపునిచ్చారు. కొయ్యలగూడెం ఆటో సెంటర్ రైస్ మిల్లు హమాలీ కార్మికుల ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాంబాబు మాట్లాడుతూ, కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినం వంటి కార్మిక చట్టాలను రక్షించుకోవడం ప్రస్తుతం పెద్ద సవాల్‌గా మారిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణ పేరుతో కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా, కార్మికులకు నష్టం కలిగించే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని విమర్శించారు. ఈ కోడ్‌ల అమలును అడ్డుకోవడం మరో సవాల్ అని, ఈ రెండు సవాళ్లను ఎదుర్కొనేందుకు 2025 మే డే సందర్భంగా మండలంలోని కార్మిక వర్గం సంఘటితంగా ప్రతిజ్ఞ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అశోక్, పి.వెంకటేష్, పత్తి రాజేష్, వీర్రాజు, షేక్ హుస్సేన్, కె.పెంటయ్య, షేక్ బాషా, కె.సీతారాం, రాములు, కె.దుర్గారావు, ఎ.నాని, సురేష్, రమేష్, దుర్గారావు, హైమావతి, రాములమ్మ, రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉంగుటూరు : కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా అన్ని గ్రామాల్లో సిఐటియు జెండా ఎగురవేయాలని ఆ సంఘం ఉంగుటూరు మండల కార్యదర్శి సీరా అప్పారావు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో మేడే గోడపత్రికలను పంపిణీ చేశారు. నారాయణపురంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్మికుల మధ్య గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భగత్‌సింగ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బుర్రె వినోద్, నేకూరి ఆశీర్వాదం పాల్గొన్నారు. మేడే జెండా ఎగురవేతలో అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజనం నిర్వహకులు, భవన నిర్మాణ కార్మికులు, ఇతర అసంఘటిత రంగ కూలీలు పాల్గొని కార్మిక సత్తాను చాటాలని పిలుపునిచ్చారు.

ముసునూరు : మేడేను విజయవంతం చేయాలని కోరుతూ సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండలంలోని చెక్కపల్లి గ్రామంలో సిఐటియు నాయకులు, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్ల ఆధ్వర్యంలో మేడే కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ పోస్టరును విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరారు.

చింతలపూడి : దేశంలో కార్మిక సమస్యలపై, హక్కులపై కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలు, పెట్టుబడిదారులు దాడి అధికమైన సందర్భంలో 2025 మేడే ఒక ప్రత్యేకత సంతరించుకుందని సిఐటియు మండలాధ్యక్షులు నత్త వెంకటేశ్వరరావు అన్నారు. మేడే పోస్టర్‌ను అంగన్వాడీ చింతలపూడి ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఎన్.సరోజిని, ప్రగడవరం సెక్టార్ నాయకురాలు కె.కవిత, వెంకమ్మ, ఎం.సత్యవతి ఆధ్వర్యంలో మేడే గోడ పత్రికను అవిష్కరించారు. మేడేను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌వి ఎస్.నారాయణ పిలుపునిచ్చారు.

సమస్య పరిష్కారంపై అధికారులకు అభినందన

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తమ సమస్య పరిష్కారం కావడంపై అశోక్‌నగర్‌కు చెందిన శేఖర్‌నగర్, రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. వారు అభినందనలు తెలుపుతూ అసోషియేషన్ జాయింట్ సెక్రటరీ, కరస్పాండెంట్ అంబికా సుబ్బారావు సోమవారం కలెక్టర్ కె.వెట్రిసెల్వికి లేఖను అందించారు. శేఖర్‌నగర్‌లో శ్రీ వీరమాచనేని కళ్యాణ మండపం రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణకు, ప్రమాదాల నియంత్రణకు, యువత మోటార్ సైకిళ్లతో సవారీలు, స్టంట్లు నివారించడానికి ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో అర్జీని అందించామని సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు అడిగిన వెంటనే ఐదు రోజుల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం స్పీడ్ బ్రేకర్లు యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేసినందుకు కలెక్టర్, నగరపాలక సంస్థ, డిఎస్‌పిలకు తమ అసోషియేషన్ తరఫున సమిష్టిగా, ఐక్యంగా ముక్తకంఠంతో ప్రశంసలు, అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. అంకిత భావం, చిత్తశుద్ధి, సేవాభావం ఉద్యోగధర్మం కలిగిన అధికారులు ఏలూరులో పనిచేయడం ఏలూరు ప్రజల అదృష్టంగా భావిస్తున్నామని అసోషియేషన్ ప్రెసిడెంట్ కె.ప్రసన్నకుమారి, ప్రెసిడెంట్ ఎస్.సాంబశివరావు, సహాయ కార్యదర్శి అంబికా సుబ్బారావు తెలిపారు.

పరిశ్రమ స్థాపన అంశంపై ఎంఎల్‌ఎ చర్చలు

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్రంలో యుకె పెట్టుబడులు, పరిశ్రమ స్థాపన అంశంపై చర్చించడానికి ఉండవల్లిలోని సిఎం నివాసంలో సోమవారం ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి కార్తికేయ మిశ్రా, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజు, ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సిఇఒ సాయికాంత్ వర్మ తదితరులతో చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్ కుమార్ చర్చించారు. ఇటీవల వారం రోజులపాటు యూరప్ ఖండంలో యుకెలోని ప్రముఖ పట్టణాల్లో ఇన్వెస్టర్లతో ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్ చర్చలు జరిపిన నేపథ్యంలో సోమవారం సిఎం నివాసం నుంచి అందిన సమాచారం మేరకు విజయవాడ చేరుకున్న అధికారులకు వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి యుకెలోని ప్రవాసాంధ్రులు కనబరుస్తున్నా ఆసక్తిని వారు ఎంచుకునే రంగాల గురించి వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - దెందులూరు

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నామని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఎంఎల్‌ఎ ప్రభాకర్‌ను దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉదయం నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ సత్వరమే వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

నాటుసారా నియంత్రణకు సహకరించాలి

చింతలపూడి : గ్రామాల్లో నాటు సారా నియంత్రణకు అందరూ సహకరించాలని చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్ కోరారు. చింతలపూడి తహశీల్దార్ ప్రమాద్వర ఆధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటు సారా నిర్మూలన దిశగా మండల సభ నిర్వహించారు. గ్రామాల్లో నాటు సారా పూర్తిగా అరికట్టాలనే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మురళీకష్ణ, చింతలపూడి ఎస్ఐ కుటుంబారావు, డిప్యూటీ తహశీల్దార్, పంచాయతీ సెక్రటరీ, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ VI అడిషనల్ జుడీషియల్ ఫస్టు క్లాసు మేజిస్ట్రేటు, రాజమండ్రి వారి కోర్టులో

D.V.C. 5/2022

Between:

రెడ్డి చిన్న, W/o. గోపాలకృష్ణ, కామరాజుపేట, గోకవరం మండలం **-పిటిషనరు**

మరియు

రెడ్డి రాంబాబు, S/o. అప్పారావు, డో.నెం. 6-113, కొబ్బరితోట వీధి, రామాలయం వద్ద, పెంటపాడు, పశ్చిమగోదావరి జిల్లా **-రెస్పాండెంటు**

పై వ్యాజ్యము పిటిషనరు మీపై గృహహింస మరియు తదితర పరిహారములు కోరుచూ దాఖలు చేసియున్నారు. పై కేసు 6వ జుడీషియల్ ఫస్టు క్లాసు మేజిస్ట్రేటు వారి కోర్టులో రాజమండ్రి పెండింగులో మీ యొక్క సమాధానము కొరకు హాజరు కావలసినదిగా శ్రీ కోర్టు వారు ది. 26-5-25 నకు వాయిదా వేసియున్నారు. కావున పై తేదీన అనగా **ది. 26-5-2025న ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టుకు మీరు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలసి యున్నది. లేని యెడల మీకు పరోక్షముగా నిర్ణయించబడును.

జి.యు.వి.బి.రాజు

రాజమండ్రి 28-4-25 అడ్వకేట్, రాజమండ్రి సెల్: 9848370855

గ్రామపంచాయతీ కార్యాలయము, కాకరవాడ

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.02/2025 తేది.26-04-2025

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, కాకరవాడ గ్రామపంచాయితీకి ది.01-04-2025 తేది నుండి ది.31-03-2026 వరకు అనగా ఒక సం॥ కాలమునకు ఈ దిగువ తెలిపిన పనులకు కాంట్రాక్ట్ లేబరు పద్ధతిపై పనిచేయుటకు ది.29-04-2025వ తేది మధ్యాహ్నం 12.00 గంటలకు ముదినేపల్లి మండలం, కాకరవాడ గ్రామపంచాయితీ కార్యాలయం నందు పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, (లేదా) వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు స్వీకరించబడి, తిరిగి అదే రోజు మధ్యాహ్నం 1-00 గంటకు హాజరు కాబడిన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. మిగిలిన విషయములు గ్రామపంచాయితీ కార్యాలయము పనిచేయు వేళలందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పనివివరము	కాలపరిమితి	డిపాజిట్
1	PWS స్కీమ్ మోటారు ఆపరేటర్ -1	1-4-2025 నుండి 31-3-2026 వరకు	రూ.1000/-
2	వీధి దీపముల రిపేర్లు ఎలక్ట్రీషియన్ -1	1-4-2025 నుండి 31-3-2026 వరకు	రూ.1000/-
3	పారిశుద్ధ్య పనుల నిర్వహణ నిమిత్తం స్వీపరు-1	1-4-2025 నుండి 31-3-2026 వరకు	రూ.1000/-

మొత్తం-3 వ్యక్తులు

సం/- శ్రీ ఇంతేటి గణేష్
సర్పంచ్, కాకరవాడ గ్రామపంచాయితీ
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా.

సం/- శ్రీమతి కె. కృష్ణవేణి
గ్రామపంచాయితీ కార్యదర్శి, కాకరవాడ
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా.